

పక్కాగా కౌంటింగ్ ప్రక్రియ

- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో జూన్ 4న నిర్వహించనున్న కౌంటింగ్ ప్రక్రియ పక్కాగా నిర్వహించేలా చూడాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్ఒలు, ఎఆర్ఒలు, మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపిడిఒలు, కౌంటింగ్ నోడల్ ఆఫీసర్ లు, స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ హాలులో ఒక్కో హాలులో 14 టేబుల్స్‌తో పాటు ఆర్ఒ టేబుల్, అబ్జర్వర్ టేబుల్, టేబులేషన్ టేబుల్స్, చైర్స్, కార్పెట్స్, ఫ్లెక్సీలు, టేబుల్‌లపై సైనేజ్‌బోర్డులు, అభ్యర్థులకు సీటింగ్ అరేంజ్‌మెంట్, వివి ప్యాట్ కౌంటింగ్ బూత్, ఇంటర్నెట్ కనెక్షన్ ఈ నెల 26 వ తేదీ లోపు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ హాలులోపల పనిచేసే సిబ్బంది నియామకాన్ని కూడా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఆర్ఒలను ఆదేశించారు. కౌంటింగ్ హాళ్లలో నాలుగు వైపులా కూలర్లను కాకుండా నాలుగు స్టాండింగ్ ఎసిలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కంప్యూటర్స్, ప్రింటర్స్ స్కానర్లను ఏర్పాటు చేసుకోవాలని, డ్రమ్స్, ట్రేస్, పిజియన్ హోల్స్ వంటి స్టేషనరీ ఐటమ్స్ అన్నింటిని 26వ తేదీ లోపు ఆర్ఒ లకు అందచేయాలని కలెక్టర్ డ్వామా పిడిని ఆదేశించారు. 16 కౌంటింగ్ హాళ్లు, అబ్జర్వర్ రూమ్‌లలో ఇంటర్నెట్ కనెక్షన్, సిసి కెమెరాల ఏర్పాటు 26వ తేదీ లోపు పూర్తి కావాలని కలెక్టర్ కుడాను ఆదేశించారు. లంచ్ బ్రేక్ ఫాస్ట్ రిఫ్రెష్మెంట్‌కు సంబంధించిన మెనూ ఫైనల్ చేసి ఈ నెల 26వ తేదీలోపు సప్లై ఆర్డర్ ఇచ్చేయాలని కలెక్టర్ డ్వామా పిడి, డిఎస్ఒను ఆదేశించారు. జూన్ ఒకటవ తేదీ లోపు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు కూడా పూర్తి చేయాలని ఆర్ఒలను ఆదేశించారు. శుక్రవారం నాడు జిఆర్‌సి కన్వెన్షన్ హాల్లో కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో దాదాపు 1100 మంది దాకా కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొననున్నారన్నారు. ఉదయం సగం మందికి, సాయంత్రం సగం మందికి శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరితోపాటు ఆర్వోలు, ఎఆర్ఒలు , కౌంటింగ్ స్పెషల్ ఆఫీసర్లు, టాబులేషన్ సిబ్బంది, ఇతర కౌంటింగ్ సిబ్బంది ఈ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు. 60 టేబుళ్లకు పది మంది చొప్పున శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఇవిఎంలలో ఉన్న ఓట్ల లెక్కింపు ఎలా చేయాలి, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎలా చేయాలి, వ్యాలిడ్, ఇన్ వ్యాలిడ్ ఓట్లను ఏ విధంగా లెక్కించాలి అన్న అంశాలపై శిక్షణ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ పై ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలకు సంబంధించిన మెటీరియల్‌ను కూడా ఇస్తామని తెలిపారు. లూజ్ బాటిల్స్ లోకిరోసిన్, పెట్రోల్, డీజిల్ వంటివి అమ్మకాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌లు, సివిల్ సప్లయీస్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా అమ్మకాలు జరిగితే షాపులను,పెట్రోల్ బంకులను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్రాకర్స్ కూడా ఎక్కడా అమ్మకూడదన్నారు. డ్రోన్స్ ఫ్లయింగ్‌కు కూడా పర్మిషన్లు ఇవ్వ కూడదని కలెక్టర్ ఆదేశించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

పూర్తి కాని పనులు

- తరగతుల నిర్వహణ అనుమతులకు ప్రతిపాదనలు
- ప్రాధాన్యత పనులు జులైకు పూర్తవుతాయంటున్న అధికారులు
- ఇదీ ఆదోని వైద్య కళాశాల పరిస్థితి

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయదలచిన వైద్య కళాశాలల్లో ఆదోని వైద్య కళాశాల ఒకటి. కళాశాల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరగతుల నిర్వహణ అనుమతులకు ప్రతిపాదనలు పంపింది. అయితే ప్రాధాన్యత పనులు జులై ఆఖరి నాటికి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది వైద్య తరగతులు సందేహమే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా కేంద్రానికి ఆదోని పట్టణం వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో ఏవైనా ప్రమాదాలు జరిగినా అత్యవసర వైద్య సేవలు కావాలన్నా కర్నూలు వెళ్లాల్సి వస్తోంది. లేదంటే బళ్లారి, రాయచూర్ వెళ్లాల్సి ఉంటుంది. ఆదోని పట్టణంలోనే వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే ఆలూరు, ఆదోని, కోసిగి, కౌతాళం, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో దగ్గరగా ఉంటుంది. మెరుగైన సేవలు పొందటానికి వీలుగా ఉంటుంది. 2021 మే 31న రాష్ట్ర వ్యాప్తంగా 14 వైద్య కళాశాలలకు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదోని శివారులో ఎమ్మిగనూరు వెళ్లే మార్గంలో అరేకల్ వద్ద వైద్య కళాశాల పనులకు శ్రీకారం చుట్టారు. 58 ఎకరాల విస్తీర్ణంలో వంద మెడికల్ సీట్లు, 450 పడకల సామర్థ్యంతో రూ.475 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని ప్రకటించారు. 2023 చివరి నాటికి మెడికల్ కాలేజీని అందుబాటులోకి తీసుకు వస్తామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. మూడేళ్లు గడిచినా ఇప్పటి వరకూ వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. వైద్య కళాశాలకు సంబంధించి ఒక బ్లాకు మూడు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. మరో బ్లాకు రెండు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. బాలికల హాస్టల్ ఆరు ఫ్లోర్లు, బాలుర హాస్టల్ రెండు ఫ్లోర్లు శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. కిచెన్ పనులు ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. అత్యవసర విభాగం, ఇఎస్ఎస్ 1, 2 పనులు కూడా ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. మొత్తం పనులు పూర్తికావడానికి ఇంకా ఒకటిన్నర సంవత్సరం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రాధాన్యత పనులు జులై ఆఖరికి పూర్తయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు. నీటి సమస్య సహా నిధుల కొరత కారణంగానే మెడికల్ కళాశాల పనులు మందకొడిగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పనులు పూర్తి కాకుండానే ఈ ఏడాది నుంచి వైద్య కళాశాల తరగతులను నిర్వహించేందుకు అనుమతుల కోసం జాతీయ వైద్య మండలికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. పనులు పూర్తికాకుండానే తరగతులు ఎలా నిర్వహిస్తారనే సందేహం వ్యక్తం అవుతోంది. వైద్య కళాశాల తరగతులు నిర్వహించాలంటే కనీసం ఆరు నెలలు ఒపి ద్వారా చికిత్సలు అందించాలని జాతీయ వైద్య మండలి నిబంధనలు చెబుతున్నాయి. దీంతో ఈ ఏడాది తరగతులు నిర్వహించడం అనుమానంగానే ఉంది.



సాగుతున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణం

జులై ఆఖరికి ప్రాధాన్యత పనులు పూర్తి

ఆదోని వైద్య కళాశాల పనులు వివిధ దశల్లో సాగుతున్నాయి. ప్రాధాన్యత పనులు జులై ఆఖరి నాటికి పూర్తి అవుతాయి. మొత్తం పనులను పూర్తి చేసేందుకు మరో సంవత్సరంన్నర పట్టచ్చు. పనులు వేగంగానే సాగుతున్నాయి.

- ఎం.శివరామిరెడ్డి, ఎపిఎంఎస్ఐడిసి డిఇ.

పాత పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్సులను జారీ చేయాలి

- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ఆర్‌టిఎ డిప్యూటి కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పాత పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్సులను జారీ చేయాలని ఆల్‌ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (**ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్**)నాయకులు ఉప రవాణా కమిషనర్ శ్రీధర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కర్నూలు మండలం బి.తాండ్రపాడు లోని ఉప రవాణా శాఖ అధికారి కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ సిఐటియు న్యూ సిటీ అధ్యక్షులు ఆర్.నరసింహులు, కమిషనర్‌తో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రవాణా ఆర్‌టిఎ కార్యాలయాలను ప్రైవేటు పరం చేసే విధంగా ప్రభుత్వాలు నిర్ణయాలుతీసుకుంటున్నాయన్నారు. ప్రైవేటీకరణ వల్ల వాహనదారులు నష్టపోతారని ఇప్పుడున్న చలానా ధరలు విపరీతంగా పెరిగి నిజమైన డ్రైవింగ్ లైసెన్స్ పొందాల్సిన వారు పొందలేరని, ఇష్టారీతిన లైసెన్సులు ప్రైవేటు సంస్థలు జారీ చేస్తాయన్నారు. వాటి వల్ల అనేక ప్రమాదాలు జరిగే సూచనలు ఉన్నాయని వారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే ప్రక్రియ ఆర్‌టిఎ కార్యాలయంలో ఆర్‌టిఎ అధికారుల పర్యవేక్షణలో జరగాలని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేసి పాత పద్ధతిలోనే ఆర్‌టిఎ కార్యాలయం డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేసేలా తమరి ద్వారా ప్రభుత్వానికి నివేదించాలని వారు డిప్యూటీ కమిషనర్ విన్నవించారు. అనంతరం ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తప్పుపట్టలేమని మీరిచ్చిన విన్నపాన్ని ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.రాధాకృష్ణ సహాయ కార్యదర్శి మహమూద్, న్యూ సిటీ ఓల్డ్ సిటీ అధ్యక్షులు రవికుమార్, ఎస్.హుస్సేన్ వలి, నగర నాయకులు కుమార్, మళ్ళీ, బడే బయ్, ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు మున్నా, సద్దాం జుబేర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

- ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం అన్యాయమని దీనిని జిల్లా ఫ్యాప్టో తీవ్రంగా ఖండిస్తుందని వెంటనే వారిని మానవతా దృక్పథంతో సస్పెన్షన్ ఉత్తర్వులను ఎత్తివేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె శ్యామ్యూల్‌కు ఫ్యాప్టో జిల్లా నేతలు విన్నవించారు. గురువారం ఆయనను కలిసి ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాలు వినతిపత్రం సమర్పించాయి. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్.గోకారి సెక్రటరీ జనరల్ జి.తిమ్మప్ప సభ్య సంఘాల నాయకులు కలసి వినతి పత్రాన్ని సమర్పించారు. యుటిఎఫ్ నుండి యుఆర్ఎ.రవి కుమార్, నవీన్ పాటి, జయ రాజు, కాంతా రావు,ఎస్‌టియు నుండి టికె. జనార్ధన్, ఎపిటిఎఫ్ 257 నుండి తిక్కస్వామి, ప్రతాప్, ఎస్‌టియు నుంచి గోవింద్, గోవింద్ నాయక్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మే13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఉపాధ్యాయులు తమ ఎన్నికల విధులకు హాజరై ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారని, కొద్దిమంది మాత్రమే వారి అనారోగ్య కారణాలతో, అకస్మాత్తుగా సర్జరీలు చేయించుకోవడంతో హాజరు కాలేకపోయారన్నారు. ఆ నెపంతో వారిని విధుల నుంచి తొలగించడం అన్యాయమ ని, వారిని వెంటనే మానవతా దృక్పథంతో విధులలో చేర్చుకోవాలని కోరారు. ఎన్నికల విధులలో పాల్గొన్న పిఒ, ఎపిఒలకు, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల విధులలో పాల్గొంటున్నటువంటి ఉపాధ్యాయులకు సంపాదిక సెలవు మంజూరు చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

పుస్తకాల మాఫియాను అరికట్టండి

ఎన్నికల కోడ్‌తో పట్టించుకోకపోవడం సరికాదు

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా


ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎన్నికల కోడ్ పేరిట పుస్తకాల మాఫియా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం చాలా విచారకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్. అబ్దుల్లా అన్నారు. గురువారం కర్నూలు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నగర కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యా సంస్థల మాఫియా విద్యార్థుల తల్లిదండ్రులపై పుస్తకాల పేరిట ఆర్థిక భారం మోపుతున్నా విద్యాశాఖ అధికారులకు పట్టడం లేదన్నారు. ఆయా విద్యాసంస్థలు తమ సంస్థల పేరిట పుస్తకాలను ముద్రిస్తూ యథేచ్ఛగా విక్రయిస్తున్న ఆధారాలు ఉన్నా డిఇఒ, డిప్యూటీ డిఇఒలు కనీసం స్పందించడం లేదన్నారు. ఎన్నికల కోడ్ చెబుతూ కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారాలకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న విద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు కూడా భారంగా ఉందంటూ ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్, అధ్యక్షులు అమర్ బాబు, నగర ఉపాధ్యక్షులు అబ్బు , మల్లేష్, నగర సహాయ కార్యదర్శి ఆర్యన్, నగర కమిటీ సభ్యులు యోగి, ఎల్లకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల అమ్మితే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి-పత్తికొండ

ఫర్టిలైజర్ యాజమాన్యాలు నకిలీ పత్తి విత్తనాల, పిచికారి మందులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పత్తికొండ మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు హెచ్చరించారు. గురువారం పత్తికొండ మండలంలోని వివిధ ఫర్టిలైజర్ షాపులలో రికార్డులను తనిఖీలు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల రైతులు పొలాలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ షాపులను మాత్రమే విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయాలని అన్నారు. రైతులు ఏవైనా విత్తనాలు మందులు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తీసుకొని వెళ్లాలని అన్నారు. వ్యవసాయసాగుకు సంబంధించిన సూచనలు సలహాలు కావాలంటే రైతు భరోసా అధికారులను సంప్రదించాలని కోరారు.



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఎఒ

14 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు జిల్లాలో కౌంటింగ్ నిర్వహణకు ప్రతి కౌంటింగ్ హాల్లో 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. సృజన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.గురువారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా కౌంటింగ్ కోసం ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నామన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన అంశాలనుపూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కోసం రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సెస్ బ్లాక్ లోని మూడవ అంతస్తులో కర్నూలు, నాలుగవ అంతస్తులో ఆదోని , లైబ్రరీ బ్లాక్‌లోని మొదటి అంతస్తులో మంత్రాలయం, మూడవ అంతస్తులో పత్తికొండ, ఇంజనీరింగ్ బ్లాక్‌లోని మొదటి అంతస్తులో పాణ్యం, రెండవ అంతస్తులో ఆలూరు, మూడవ అంతస్తులో కోడుమూరు, నాలుగవ అంతస్తులో ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ హాల్ లను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ హాల్‌ల వద్ద 72 సిఎపిఎఫ్, 70 ఎస్‌ఎపి, 391 సివిల్ పోలీసు సిబ్బందితో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని, ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో అన్ని సదుపాయాలతో మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా అభ్యర్థులు,ఏజెంట్ల కమ్యూనికేషన్ కోసం ఇంజనీరింగ్ విభాగంలో కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ లను సిసి కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు... పార్లమెంట్,అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మంత్రాలయం 17 రౌండ్లలో, కర్నూలు, పత్తికొండ, ఆదోని 19 రౌండ్లలో, ఎమ్మిగనూరు, కోడుమూరు 20 రౌండ్లలో, ఆలూరు 21 రౌండ్లలో, పాణ్యం 26 రౌండ్లతో పూర్తి అవుతుందని కలెక్టర్ వివరించారు. కౌంటింగ్ సిబ్బందికి సంబంధించిన మొదటి ర్యాండమైజేషన్ ఈనెల 27న, రెండవ ర్యాండమైజేషన్ జూన్ 3వ తేదీన నిర్వహించనున్నామని, వీరికి ఈ నెల 24, 31 తేదీలలో రెండు విడుతలలో శిక్షణ నిర్వహిస్తామన్నారు.



కౌంటింగ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ , అధికారులు

కౌంటింగ్ శిక్షణకు హాజరు కావాలి

కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి శుక్రవారం నాటి శిక్షణ కార్యక్రమానికి సిబ్బంది అంతా హాజరుకావాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. గురువారం కర్నూలు మండలం దిన్నదేవరపాడు గ్రామంలోని జిఆర్‌సి కన్వెన్షన్ హాల్లో సాధారణ ఎన్నికలు - 2024 కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి మే 24న నిర్వహించనున్న శిక్షణ తరగతులకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజలతో కలిసి జిల్లా కలెక్టర్ డా జి.సృజన పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ శిక్షణకు హాజరయ్యే సిబ్బందికి కలెక్టరేట్ నుండి బస్సులు ఏర్పాటు చేస్తున్నామనే విషయాన్ని వారికి తెలియచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి ఉన్నారు.

విత్తనాన్ని నాణ్యతతో అందించాలి

మంచి విత్తనం వల్ల మంచి దిగుబడులు-వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

రైతులకు వేరుశనగ విత్తనాలను నాణ్యతతో అందించాలని, మంచి విత్తనం వల్ల మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పిఎల్ వరలక్ష్మీ సూచించారు. ఖరీఫ్-2024 పంట కాలానికి సంబంధించి వేరుశనగ విత్తనాన్ని రైతులకు రాయితీపై అందించుటకు వ్యవసాయ శాఖ ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకొన్నది. ఇందులోభాగంగా ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ వారు గద్వాల జిల్లాలోని మహంకాళేశ్వర అగ్రిటెక్ ప్రైవేటు లిమిటెడ్, కర్నూలు జిల్లాలోని శ్రీచక్ర సీడ్స్, శ్రీకృష్ణ సీడ్స్ , శ్రీ శివసాయి సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లలో విత్తన శుద్ధి ప్రక్రియ చేపట్టి తదుపరి మండలాలలోని రైతు భరోసా కేంద్రాలకు వారికి నిర్దేశించిన లక్ష్యం మేరకు వేరుశనగ విత్తనాన్ని పంపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్. వరలక్ష్మి విత్తన నాణ్యతా ప్రమాణాలను తెలుసుకొనుటకు కర్నూలు సహాయ వ్యవసాయ సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ విత్తనాభివద్ధి సంస్థ కర్నూలు మేనజర్ ,కల్లూర్ మండల వ్యవసాయ అధికారితో కలసి ఆకస్మికంగా కల్లూలు మండల పరధిలోగల శ్రీకష్ణ సీడ్స్ , శ్రీ శివసాయి సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించి విత్తనశుద్ధి ప్రక్రియను తనిఖీచేశారు. శుద్ధి చేసిన విత్తనం నాణ్యత ప్రమాణాలైన షెల్లింగ్ , మొలక శాతం వంటి వాటిని ప్రత్యేకంగా పరిశీలించి ఇందులో నిర్దేశించిన ప్రకారం నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నట్లయితే అట్టి విత్తనం పలుమార్లు శుద్ధి చేయాలన్నారు. లేనిపక్షములో మొత్తం విత్తనాన్ని నిలుపుదల చేస్తామన్నారు. సంబంధిత విత్తన సంస్థపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లను వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ అధికారులు , సంబంధిత సహాయ వ్యవసాయ సంచాలకులు విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో కలసి నాణ్యత నిర్ధారణ పరిశీలిస్తారన్నారు. జిల్లాకు కేటాయించిన 13,969 క్వింటాళ్ల విత్తనానికి గాను గురువారం వరకు మొత్తంగా 3,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం శుద్ధి చేసి వివిధ రైతుభరోసా కేంద్రాలకు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిసీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి, కర్నూలు ఎడిఎ సాలు రెడ్డి, ఎఒ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



వేరుశనగ విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, తదితరులు

గెస్ట్ హౌస్‌లో అధునీకరించిన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఆధునీకరించిన గదులను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో5 గదులు, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒక గదిని ఆధునీకరించాయన్నారు. జెసి నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమీషనర్ భార్గవ తేజ, డిఆర్ఒ మధుసూదన్ రావు, ఆర్అండ్‌బి ఎస్ఇ నాగరాజు, ఇఇ సురేష్ బాబు, ఇఇ(ఎలక్ట్రికల్) ఝాన్సీ రాణి, డిఇఇ రవిచంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునిటి సమస్య లేకుండా చూడాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-సి బెళగల్ : సి.బెళగల్ మండలంలో అన్నీ గ్రామాల్లో తాగునిటి సమస్య లేకుండా చూడాలని ఎంపిడిఒ శకుంతల సంబందించిన అధికారులకు సూచించారు. గురువారం సమీక్షించి తాగునీటి సమస్యపై ఆరా తీశారు..ముడుమాల, బెళగల్ లోని బిసి కాలనీ, పోలకల్‌లో బిసి కాలనీలలో సమస్యలు ఉన్నట్లు తెలిసిందని అన్నారు. కొన్ని గ్రామాల్లో నీటి శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారని అన్నారు. సురక్షితమైన నీటిని అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలన్నారు.



రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న నిర్వహకులు

రాతిదూలం విజేత అనంతపురం వృషభాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా కల్లూరు మండలం పందిపాడు గ్రామ శివారులో పూలతోటలో శంకరయ్య తాతఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 12 జతల వృషభరాజములు హాజరయ్యాయి. 4858 అడుగుల దూరం లాగిన అనంతపురం జిల్లా పూట్లపల్లె గ్రామ రైతు బచ్చాల భాస్కర్ రెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. రూ.30,000 దాత కె.దేవేందర్‌రెడ్డి బహుమతిని అందించారు. 4795 అడుగుల దూరం లాగిన పల్నాడు జిల్లా అనంతవరం గ్రామ రైతు గోగిరెడ్డి వెంకటరెడ్డి వృషబాలు రెండవ స్థానంలో నిలిచి బహుమతి రూ.20000 దాత కూరపాటి భీమేశ్వర్ రెడ్డి అందజేశారు. 4561 అడుగుల దూరం లాగిన నంద్యాల జిల్లా మల్యాల గ్రామ రైతులు రత్నం , ఎస్ఎస్‌సి ట్రేడర్స్ వృషభాలు మూడవ స్థానంలో నిలిచి బహుమతి రూ.15000 దాత కూరపాటి ఉమామహేశ్వర్ రెడ్డి అందజేశారు. 4500 అడుగుల దూరం లాగిన కర్నూలు జిల్లా కలగోట్ల గ్రామ రైతు రమేష్ నాయుడు , కర్నూలు జిల్లా పెద్ద నెలటూరు గ్రామ రైతు సీతారాముడు వృషభాలు 4వ స్థానంలో నిలిచి బహుమతి రూ. 10000 దాత పూల శంకర్, గొల్ల పెద్ద వెంకటస్వామి అందజేశారు. 4149 అడుగుల దూరం లాగిన నంద్యాల జిల్లా ఎ. కోడూరు గ్రామ రైతు చాగంటి నాగ మల్లికార్జునరెడ్డి, వృషభాలు ఐదవ స్థానంలో నిలిచి బహుమతి రూజ5000 పూల శంకరయ్య స్వామి అందజేశారు.

సాయం కోసం రైతు ఎదురుచూపు

- భూ సర్వే సాకుగా చూపి పెంచని పంట రుణాలు
- జూన్ మొదటి వారానికి నైరుతి కబురు

వ్యవసాయం ఎప్పుడు సాయంపై ఆధారపడుతుంది. రైతులు ఎప్పుడు నగదు పెట్టుబడితో పంటలు సాగు చేసే పరిస్థితులు రావడంలేదు. ఏటా అతివృష్టి, లేదా అనావృష్టి. అన్ని బాగుంటే గిట్టుబాటు ధరలు ఉండవు. ఇలా ఎదో ఒక ఇబ్బందులతో రైతులు తీవ్ర మనస్తాపం చెంది బలన్మరణాలు చేసుకుంటున్నారు. ఈ రెండు సంవత్సరాలలో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 52 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇంకా లెక్కలు వేయనివి చాలా ఉన్నాయి. అలాంటి రైతులకు ప్రభుత్వం ప్రతి పంటకు గిట్టుబాటు ధరను, సకాలంలో ఎరువులు, నాణ్యమైన విత్తనాలను అందించాలని కోరుతున్నారు...


విత్తనం సాగు చేస్తున్న రైతులు (ఫైల్)

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఈ ఏడాది తొలకరి జల్లులు నైరుతి త్వరగా పలకరిస్తుందని జూన్ మొదటి వారానికి వర్షాలు వస్తాయని వాతావరణ అధికారులు, వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. దీనికి అనుగుణంగా రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. భూ సర్వే చేసిన భూములకు 1 బి, అడంగల్ ఆన్ లైన్‌లో లాక్ పడ్డాయి. జిల్లాలో చాలా మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా బ్యాంక్ అధికారులు ఒరిజినల్ 1 బి, అడంగల్ లేవని, జిరాక్స్‌లపై రెవెన్యూ అధికారుల సంతకం కావాలని అలా తెచ్చిన గతేడాది ఎంత అప్పు ఇచ్చారో అదే అప్పులు రెన్యువల్ చేశారు. భూమి ఎక్కువ ఉన్నా ఈ ఏడాది పెట్టుబడులు, కూలీలు, విత్తనాలు, ఎరువులు పెరిగాయని తెలిపినా బ్యాంక్ అధికారులు రుణం పెంచకపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ప్రధానంగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లు రైతులకు యమపాశాలయ్యాయి. ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం, అదనంగా వడ్డీ కట్టించుకోవడం పరిపాటిగా అయింది. అధికారులు దీనిపై దృష్టి పెట్టి రైతులకు భూమికి తగినంత రుణాన్ని ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2023లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు చేతికి రాలేదు. 670 మిల్లీమీటర్లకు గాను 300 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అయితే ఈ ఏడాది లానినో ప్రభావం వల్ల జూన్ మొదటి వారానికి ఆశాజనకంగా వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. నైరుతి ముందు రావడం వల్ల రైతులు విత్తన శుద్ధి, పంట పొలాలు సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది మొత్తానికి వర్షాలు అనుకున్న స్థాయిలో కురుస్తాయని వాతావరణ అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే మే మాసంలో 40.1 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 77.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. 94 శాతం అధికంగా వర్షం కురవడంతో రైతుల్లో మరింత ఆశలు చిగురించాయి.

గతేడాది ఎరువులపై భారం

2024 ఖరీఫ్ సాగు 4,19,219 హెక్టార్లలో సాగు జరుగుతుంది. పత్తి 2,43,689 హెక్టార్లు, వేరుశనగ 58,969 హెక్టార్లు, కంది 25,567 హెక్టార్లు, ఆముదం 9,231 హెక్టార్లు, మిరప 29,988 హెక్టార్లు, ఉల్లి 15,698 హెక్టార్లు, వరి 12,771 హెక్టార్లు, ఇతర పంటలు 23,306 హెక్టార్లలో సాగు జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఆర్బికేల ద్వారా ఎరువులు సిద్ధం చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాలో డిఎపి, యూరియా, కాంప్లెక్స్, పోటాష్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. గతేడాది ప్రయివేటు డీలర్ల ద్వారా బస్తాకు అధికంగా చెల్లించి తీసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది అలాంటి కొరత లేకుండా సకాలంలో అందించాలని రైతులు కోరుతున్నారు.

ముంచుతున్న నకిలీలు..

పత్తి పండించడంలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా రెండవ స్థానంలో ఉంది.అలాంటి పత్తి నాణ్యమైన విత్తనాన్ని అందించాలని రైతుల అవసరాలను తమ ప్రయోజనాల కోసమే అన్నట్లుగా వ్యాపారులు జేబులు నింపుకోవడం సాధారణమై పోయింది. ముఖ్యంగా పత్తి 2.43 హెక్టార్లల పైగా సాగులో ఉన్నా కూడా అవసరమైన బీటీ-2 విత్తనాలు అందించడానికి జిల్లా వ్యవసాయ శాఖ శ్రద్ధ తీసుకోవడం లేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. 2022, 2023 ఖరీఫ్ సీజన్లలో రైతుల్ని నాణ్యమైన పత్తి విత్తనాల పేరుతో దళారులు, వ్యాపారులు కొంత మంది అధికారుల అండదండలతో నాసిరకం, కల్తీ విత్తనాలను రైతులకు అంటగట్టారు. జాదూరకం కంపెనీకి చెందిన నాసిరకం విత్తనాలను పొలాల్లో విత్తడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ రైతులకు దాదాపు రూ.20 కోట్లు చెల్లించాలని జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇంత వరకు ఆ రైతులకు నష్టపరిహారం అందించలేదు. రైతు సంఘాలు దీనిపై పోరాడుతున్నాయి. రైతాంగాన్ని నాణ్యమైన విత్తనం, ఎరువులు, అందించి మంచి దిగుబడులు వచ్చేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎలాంటి సమస్యలున్నా సంప్రదించండి

- సాలు రెడ్డి, ఎడిఎ, కర్నూలు.



ఖరీఫ్ సాగుకు విత్తనాలు ఆర్బికేలలో అందుబాటులో ఉన్నాయి. ఎరువులు సకాలంలో అందిస్తాము. ఖరీఫ్ సాగుకు సంబంధించిన సమాచారం ఏదైనా ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్ ఆశాజనకంగా ఉంటుంది.



కొండెక్కిన 'కోడి'

- కోడి మాంస ధరలు పైపైకి
- ఎండల తీవ్రతతో తగ్గిన కోళ్ల ఉత్పత్తి
- ముమ్ముందు ఇంకా ధరలు పెరిగే అవకాశం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కోడి మాంసం ధరలు కొండెక్కాయి. ఎండల తీవ్రతతో కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. ముమ్ముందు ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కిలో చికెన్ రూ.300కి చేరింది. గత ఆదివారం స్కిన్ లెస్ కిలో రూ.270 వరకూ ఉండగా ఇప్పుడు రూ.40 పెరిగింది. ఎండల తీవ్రతతో ఫారాల్లో కోళ్ల పెంపకం తగ్గిపోయింది. అదే సమయంలో కోడి పిల్లలు చనిపోతున్నాయి. ఉత్పత్తి తగ్గిపోవడం, కొనుగోళ్లు పెరగడం ధరల పెరుగుదలకు కారణమైంది. వేసవిలో ఫారం, బాయిలర్ కోళ్లు ఎండ వేడిమికి చనిపోతుంటాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఫారాల నిర్వహణపై పెద్దగా ఆసక్తి చూపరు. ఒకవేళ నిర్వహించినా నష్టాలు రావడంతో రైతులు వీటికి దూరంగా ఉంటున్నారు. దీంతో కోళ్లు అందుబాటులో లేక ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దాణా రేట్లు పెరగడంతో నిర్వహణ భారంగా మారిందని రైతులు చెబుతున్నారు. ఫలితంగా కోడిమాంసం ధర అమాంతం కొండెక్కింది. వేసవిలో గ్రామాల్లో జాతరలు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. గతంలో కంటే రెస్టారెంట్, భోజనం హోటల్‌లో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లోనూ చికెన్ వినియోగం బాగా పెరిగింది. ఈ కాలంలో చేపల వినియోగం తగ్గి మాంసం వినియోగం పెరగడమూ మరో కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్‌కు తగినట్లు కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతో చికెన్ ధరలు పెరిగాయి. దూర ప్రాంతాల నుంచి రవాణా ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. ఇది కూడా ధరల పెరుగుదలకు ఒక కారణమని వ్యాపారులు అంటున్నారు. మరో పక్షం రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని, ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

రాయితీ టార్పాన్లను సద్వినియోగం చేసుకోండి

- కెడిసిఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



ప్రభుత్వం రైతులకు రాయితీ కింద అందిస్తున్న టార్పాన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కెడిసిఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బజార్‌లో నాసిరకం టార్పాన్లను కొనుగోలు చేసి రైతులు మోసపోయే కంటే ప్రభుత్వం రాయితీ కింద అందజేస్తున్న టార్పాన్లను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. టార్పాన్ల పొడవు, వెడల్పు 18×24 ఉంటుందని చెప్పారు. నాసిరకం టార్పాన్లను బజార్‌లో రూ.2,300కు రైతులకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. 250 జిఎస్ఎమ్ 10 కిలోల బరువు గల టార్పాన్లను అదే కెడిసిఎంఎస్ గోడౌన్‌లో 3వ నెంబర్‌లో రూ.1,700లకే ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం కెడిసిఎంఎస్ మేనేజర్ ఫోన్ 6302675433 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

క్షయ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వీడాలి

- ఎంపిహెచ్ఒలు బాబురాజు, సుబ్బమ్మ బాయి

ప్రజాశక్తి - ఆదోని

క్షయ (టిబి) వ్యాధి పట్ల నిర్లక్ష్యం వీడి అప్రమత్తంగా ఉండాలని ఎంపిహెచ్ఒలు బాబురాజు, సుబ్బమ్మ బాయి, డబ్ల్యుహెచ్ఎస్ ఈరన్న తెలిపారు. గురువారం ఆదోనిలోని మ్యాక్ సెంటర్‌లో సచివాలయ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... రెండు వారాల పాటు దగ్గు ఉన్నట్లయితే టిబిగా అనుమానించాలని తెలిపారు. టిబి ఉన్న వ్యక్తికి ఉదయం, సాయంత్రం జ్వరం వస్తూ ఉంటుందన్నారు. బరువు తగ్గడం, శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉండడం, రక్తపు ఛారలతో కూడిన గళ్ల పడడం తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఈ లక్షణాలు ఉన్న వారు ఉదయం తీసిన గళ్లను తీసుకొస్తే నిర్ధారణ కోసం పరీక్షకు పంపుతామన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకూ బిసిజి వ్యాక్సిన్ వేయించాలన్నారు. వ్యక్తికి, వ్యక్తికి రెండు మీటర్ల దూరం పాటించడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మోచేతిని అడ్డం పెట్టకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. ఆశాలు నాగవేణి, లలిత, ప్రజలు పాల్గొన్నారు.

విజ్ఞాన వేసవి శిబిరాలు..
వినోదాల సంబరాలు...

ప్రజాశక్తి - కౌతాళం


విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

గ్రంథాలయ సంస్థ చేపడుతున్న విజ్ఞాన వేసవి శిబిరాలు పేద విద్యార్థులకు వినోదాల సంబరాలను తలపిస్తున్నాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయ అధికారులు నిర్వహిస్తున్న విజ్ఞాన వేసవి శిబిరాలు ఎంతో ఉపయోగపడు తున్నాయి. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుతూ విజ్ఞానంతో పాటు వినోదాన్ని గ్రంథాలయాల ద్వారా అందిస్తున్నారు. గ్రంథాలయంలో ఉన్న వందల పుస్తకాల పరిచయంతో పాటు, క్విజ్, ఆటల పోటీలు, స్వీయ రచన, వివిధ అంశాలతో విద్యార్థులతో చర్చ తదితర కార్యక్రమాలతో విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందిస్తున్నాయి. ఇందులో భాగంగా కౌతాళంలో కొన్ని రోజుల నుంచి గ్రంథాలయం అధికారిని మధు లీల విజ్ఞాన వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. రోజూ కొత్తదనంతో విద్యార్థులతో కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎంతోమంది విద్యార్థులు ఈ విజ్ఞాన శిబిరం ద్వారా కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిని మధు లీల గురువారం కోరారు.

మరోసారి వైసిపికే అధికార పీఠం

- ఓటమి భయంతోనే టిడిపి దాడులు - ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
- మనవళ్లతో సేదతీరుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

మరోసారి వైసిపినే అధికారం చేపడుతుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే టిడిపి నాయకులు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు ముగిశాక ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తన మనవళ్లతో ఆటలాడుతూ ప్రశాంత వాతావరణంలో ఆనందంగా కనిపించారు. గురువారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని ఆయన స్వగృహంలో తన మనవళ్లతో సరదాగా గడిపారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి ఎన్నికల హడావిడి ఉండడంతో నిత్యం ప్రజల మధ్య గడిపిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఎన్నికలు పూర్తి కావడం, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇంటి వద్దనే ఉంటున్నారు. తనను కలవడానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఓటింగ్ సరళిపై ముచ్చటిస్తూ గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి గురించి చర్చిస్తున్నారు. సాయంత్రం వేళల్లో తన మనవళ్లతో ట్యాబ్‌లో ఆడుతూ ఆనందంగా గడుపుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు మరోసారి వైసిపికి అధికార పీఠం అప్పగించడం ఖాయమని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే టిడిపి నాయకులు పోలింగ్ రోజు నుంచి రాష్ట్రంలో అల్లర్లను సృష్టిస్తూ దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, వైసిపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉండి అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి ఉన్నారు.


మనవళ్లతో ఆడుకుంటున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

వైభవంగా పీఠాధిపతుల పట్టాభిషేకం

ప్రజాశక్తి - మంత్రాలయం


పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని నంజనగూడ శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో ఆయన 12వ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా వివిధ హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులతో పాటు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ఇఇ సురేష్ కోనాపూర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల ఫలితాల సందర్భంగా

గొడవలకు పాల్పడితే చర్యలు

- సిఐ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

జూన్ 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన రెడ్డి హెచ్చరించారు. గురువారం నందవరం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ పి.తిమ్మయ్య ఆధ్వర్యంలో వివిధ పార్టీల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ ఉన్నందున కౌంటింగ్ అనంతరం ఏ పార్టీ గెలిచినా, ఏ పార్టీ ఓడినా 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో బాణసంచా కాల్చడం, ఊరేగింపులు చేయకూడదని సూచించారు. గ్రామంలో అల్లర్లు సృష్టిం చినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగిం చినా నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతాని హెచ్చరించారు. ఎన్నికలు శాశ్వతం కాదని, ఎన్నికల్లో గెలుపోటములు సమానంగా తీసుకొని ముఖ్య నాయకులు తమ కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలని కోరారు. ఎన్నికల ముందు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఎన్నికల తర్వాత కూడా ప్రశాంతంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల ఫలితాల ను దృష్టిలో పెట్టుకొని ఒకరిపై ఒకరి దాడులు, మనస్పర్థలు తెచ్చుకుని గొడవలకు దిగితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీల నాయకులకు సూచనలు ఇస్తున్న సిఐ మోహన్ రెడ్డి

శ్రీమఠంలో రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ఆమె భర్త, అనుచర వర్గంతో కలిసి గురువారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆమెకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయకులు బింధు మాధవాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠంలో స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న మంత్రి


నియామకపత్రం అందుకుంటున్న నూర్ అహ్మద్

ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శిగా నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఆదోనికి చెందిన ఎ.నూర్ అహ్మద్ నియమితులయ్యారు. గురువారం ఆయన ఆదోనిలో విలేకరులతో మాట్లాడారు. తాను చేసిన సమాజ సేవ, ప్రజా సమస్యలపై పోరాటాలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారని తెలిపారు. ఎంహెచ్‌పిఎస్ అధ్యక్షులు మహ్మద్ ఫారూక్ షుబ్లీకి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకముంచి అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తిస్తానన్నారు. మైనారిటీల హక్కుల పరిరక్షణ కోసం, రాష్ట్రం, దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతికి, శాంతియుత వాతావరణానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సహకరించిన సహచరులకు, ఆదోని ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు గురువారం ముగిశాయి. గురువారం దర్గాలో భక్తుల సమక్షంలో స్వామివారి జియారత్ కార్యక్రమాన్ని ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాలకు వచ్చిన ఫకీర్ సాబ్‌లను సన్మానించి సాగనంపారు. గత నాలుగు రోజుల నుంచి వైభవంగా జరిగిన ఉరుసు ఉత్సవాలు ముగిసినట్లు ధర్మకర్త తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంచాయతీ అధికారులు, సిబ్బంది, పోలీసు శాఖ, విద్యుత్ శాఖ, ఆయా డిపోల అధికారులకు, ఉరుసు ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.


ఫకీర్ సాబ్‌లను సన్మానిస్తున్న ధర్మకర్త


జియారత్ నిర్వహిస్తున్న ధర్మకర్త

వైభవంగా ఆంజనేయ స్వామి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి వారితో ప్రతిష్ఠంచిన శ్రీఆంజనేయ స్వామి రథోత్సవం వైభవంగా సాగింది. గురువారం పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆంజనేయ స్వామి ఆలయంలో గణపతి పూజ, పవన హోమం, ఆగమ హోమం, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను వేద పండితులు ప్రాణేష్ ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి విగ్రహాన్ని రథంపై ఉంచి భక్తి శ్రద్ధలతో రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాలను నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వేదపండితులు వేణు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

'బార్' భవనంపై పిడుగుపాటు

- పైకప్పు శిథిలం
- భవనాన్ని కేటాయించాలని న్యాయవాదుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయ భవనంపై పిడుగు పడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పిడుగు పడడంతో భవనం పైకప్పు శిథిలావస్థకు చేరుకుంది. పిడుగు పడి పాక్షికంగా దెబ్బతిన్న ఆదోని బార్ అసోసియేషన్ భవనాన్ని మార్పు చేయాలని గురువారం న్యాయవ్యాదులు కోరారు. భవనం లేకపోవడంతో ఆరు బయటనే న్యాయవాదులు కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురువారం వారు ఆదోనిలో మాట్లాడారు. న్యాయవాదులు బయట కూర్చోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉండే న్యాయమూర్తుల క్వార్టర్స్‌ను వినియోగించుకునేందుకు ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు జిల్లా ప్రధాన న్యాయమూర్తితో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలం వస్తున్నందు న బార్ భవనాన్ని మార్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.


పైకప్పు కూలిన భవనం